శాస్త్రవేత్తలు... మీకు జోహార్లు...

SPECIAL FEATURE IN GUDUR DIVISION

వైభవంగా బ్రహ్మోత్సవాలు

దక్కిలి: వెంబులూరు పంచాయతీలోని వెలుగొండలు కింద (పెదకోన) ఉన్న ఆదిలక్ష్మి సమేత యోగనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాలు రెండో రోజైన ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం వేదపారాయణం, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి పల్లకిలో ఉత్సవామూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు విజయ్‌కుమార్, సుబ్బారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అధికారులపై నిందలు తగవు

వెంకటగిరి: వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించి, అవి వీలుకాకపోవడంతో నిబద్ధతగా పనిచేస్తున్న తహసీల్దార్ పద్మావతిపై కొందరు ఆరోపణలు చేయడం తగదని వెంకటగిరి పీఏసీఎస్ అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిస్వార్థంగా ప్రజలకు సేవలందించే తహసీల్దార్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. స్థానికంగా అధికారులతో సమస్యలుంటే వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. పారవోలు ఎంపీటీసీ సభ్యురాలు పుల్లూరు శ్రీదేవి మాట్లాడుతూ మండలంలో ఏ కార్యక్రమం నిర్వహిస్తున్నా తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం నుంచి తమకు సమాచారం ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఈరి పెంచలయ్య, వల్లివేడు ఎంనపీటీసీ సభ్యురాలు జే వరమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆవుల గిరియాదవ్, నాయకులు పి సదానందరెడ్డి, రాజారెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

ప్రాణం ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీలోనే..

నాయుడుపేటటౌన్: తన ప్రాణం ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతానని, తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న ప్రచారాలను నమ్మవద్దని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ స్పష్టం చేశారు. పట్టణంలోని 786 సేవా సంఘ కార్యాలయం వద్ద ఆదివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితర నాయకులతో కలసి దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు, అధికారులు తదితరులకు విందు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఓడూరు గిరిధర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, నాయకులు బైనా మల్లికార్జునరెడ్డి, కే జయరామయ్య, అన్నమేటి చంద్రారెడ్డి, పసల చెంగయ్య, దారా రవి పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య, రఫీ తదితరులు

విస్తృతంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

గూడూరు/చిల్లకూరు/ఓజిలి: పలు మండలాల్లో ఆదివారం జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గూడూరు సచివాలయ కన్వీనర్ మూలి కిషోర్, కొట్టు అశోక్, చిల్లకూరు నారాయణ, వెందోటి మాధవయ్య, లేపాక రాధయ్య, వేముల శ్రీనివాసులు, చిల్లకూరు, శ్రీనివాసులు, కొట్టు రవి, జడ శ్రీనివాసులు, చింతకుంట కోటి, సుందరం, మాజీ సర్పంచ్ జయరామయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

చిల్లకూరు/నాయుడుపేట/కోట: బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. చిల్లకూరులో ఐదో తరగతి పరీక్షకు 316 మంది, ఇంటర్ పరీక్షకు 202 మంది హాజరయ్యారు. నాయుడుపేటలో ఐదో తరగతికి 209 మంది ఇంటర్‌కు 146 మంది ప్రవేశ పరీక్షలు రాశారు. కోటలో ఐదో తరగతి పరీక్షకు 211 మంది, ఇంటర్‌కు 146 మంది హాజరయ్యారు.

సర్వే రాళ్ల ఏర్పాటు వేగవంతం చేయండి

సైదాపురం: జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకంలో భాగంగా జిల్లాలో సర్వేరాళ్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని జిల్లా ఏడీ హనుమాన్‌ప్రసాద్ ఆదేశించారు. ఆదివారం మండలంలోని జోగిపల్లెలో సర్వే రాళ్లను ఏర్పాటును ఆయన పరిశీలించారు. ఆయన వెంట రీసర్వే డీటీ ప్రసాద్, సర్వేయర్ హజరత్తయ్య, సహాయకులు అరుణ్, గిరి తదితరులున్నారు.

అన్నదానం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద అక్షయ తృతీయని పురస్కరించుకుని భగవతి మల్లికాంబ ఆలయ నిర్వాహకులు సుమారు 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి ప్రారంభించారు. ఆలయ నిర్వహకులు గూడూరు సుధీర్‌రెడ్డి, అమాస రామానారాయణ, నేతలు దారా రవి, ముత్యాలరెడ్డి, కొప్పులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నేడు

వెంకటగిరి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు సోమవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

రాపూరులో వర్షం

రాపూరు: మండల కేంద్రంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉదయం నుంచి వేడి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు భారీ వర్షం కురవడంతో సేదతీరారు.